క్లుప్తంగా

అందుబాటులో టమాటాలు



రైతుబజారులో టమాటా విక్రయస్టాల్

విశాఖ విద్య: వినియోగదారులకు అందుబాటులో ఉండేలా రైతు బజారులో టమాటా విక్రయాలు చేపడుతున్నట్లు మర్రిపాలెం రైతు బజార్ ఈవో కొమ్మనాపల్లి వరహా లు చెప్పారు. రైతు బజారులో నిర్వహిస్తున్న టమాటా స్టాల్‌ను ఆయన పరిశీలించారు. బయట మార్కెట్‌లో టమాటా ధరలు ఎక్కువగా ఉండడంతో వినియోగదారులకు ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేశామన్నారు. ప్రస్తుతం దిగుబడి పెరగడంతో రేటు తగ్గిందన్నారు. అందుబాటులో ఉండేలా చర్యలు చేపట్టామన్నారు.

నాయీ బ్రాహ్మణ సంఘం అధ్యక్షుడిగా పైడిరాజు



విశాఖ విద్య: విశాఖ జిల్లా నాయీ బ్రాహ్మణ సేవా సంఘం అధ్యక్షుడుగా ఎన్ఏడీకి చెందిన నరవ పైడిరాజు ఎంపికయ్యారు. ఈ మేరకు మంగళవారం ఎన్ఏడీలో జరిగిన సమావేశంలో పైడిరాజు మాట్లాడుతూ నాయీ బ్రాహ్మణుల సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానన్నారు. జిల్లాలోని అన్ని నియోజకవర్గాలకు కన్వీనర్లను నియమించినట్టు చెప్పారు. నియోజకవర్గాల వారీగా పర్యటించి నాయీ బ్రాహ్మణులను సంఘటితం చేస్తామన్నారు.

చంద్రబాబు చిత్రపటానికి క్షీరాభిషేకం



చంద్రబాబు చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న ఎమ్మెల్యే గణబాబు

మల్కాపురం: కూటమి ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఇసుక పాలసీ వల్ల రాష్ట్రంలో ఎంతో మంది భవన నిర్మాణ కార్మికులు,కాంట్రాక్టర్లు హర్షం వ్యక్తం చేస్తున్నారని ఎమ్మెల్యే పి.గణబాబు అన్నారు. ఇసుక విధానంపై ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని స్వాగతిస్తూ పారిశ్రామిక ప్రాంత భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో 58వ వార్డు గుల్లలపాలెంలో మంగళవారం ముఖ్యమంత్రి చంద్రబాబు చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో వార్డు టీడీపీ అధ్యక్షుడు కోరాడ శ్రీను, 63వ వార్డు కార్పొరేటర్ గల్లా చిన్నా,టీఎస్‌టీయూసీ నాయకులు నక్క లక్ష్మణరావు,జనసేన నాయకురాలు అంగ దుర్గాప్రశాంతి తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన దుర్గాలమ్మతల్లి మహోత్సవాలు



దుర్గాలమ్మ అమ్మవారిని ఊరేగిస్తున్న భక్తులు

మల్కాపురం: జీవీఎంసీ 61వ వార్డు మల్కాపురం ఈ నెల 7వ తేదీన మొదలైన దుర్గాలమ్మతల్లి పండగ మహోత్సవాలు మంగళవారంతో ఘనంగా ముగిశాయి. ఉత్సవాల్లో భాగంగా అమ్మవారిని మేళ తాళాలు, బాణ సంచా నడుమ మల్కాపురం పురవీధుల్లో ఊరేగించారు. భక్తులు అమ్మవారికి పసుపు-కుంకుమ, చీర, సారె సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. కార్యక్రమంలో మల్కాపురం జాలరి సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

సిరులతల్లికి అష్టదళ పద్మారాధన

దాబాగార్డెన్స్: బురుజుపేటలో వెలసిన కనక మహాలక్ష్మి అమ్మవారి దేవస్థానంలో మంగళవారం 108 స్వర్ణపుష్పాలతో అష్టదళ పద్మారాధన నిర్వహించారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు నిర్వహించిన ఈ పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. కార్యక్రమాన్ని ఈవో పి. శ్రీనివాసులరెడ్డి పర్యవేక్షించారు.



వుడా కాలనీలోని చిల్డ్రన్స్ పార్కు



పార్కులో పచ్చనిగ్రీనరీ మధ్య కూర్చొనేందుకు ఏర్పాట్లు

ఉల్లాసంగా.. ఉత్సాహంగా..

- వుడా లే అవుట్ పార్కుకు సరికొత్త అందాలు
- చిన్నారులకు ఆట పరికరాలతో జోష్
- పార్కులో భద్రతకు ప్రత్యేకంగా సీసీ కెమెరాలు



వ్యాయామం చేస్తున్న మహిళలు



పిల్లల ఆట పరికరాలు

విశాఖ విద్య: సుందరంగా తీర్చిదిద్దిన పార్కులు సందర్శకులతో కళకళలాడుతున్నాయి. పిల్లలు, పెద్దలతో పార్కులు నిండిపోతున్నాయి. సాయంత్రం వేళలో పిల్లలతో కలసి పార్కులో కొంత సేపు గడిపి ఆహ్లాదకరమైన వాతావరణాన్ని ఆస్వాదించేందుకు నగరవాసులు ఆసక్తి చూపుతున్నారు. పార్కుల్లో వ్యాయామ పరికరాలు, పిల్లలు ఆడుకునేందుకు వీలుగా తగిన ఏర్పాట్లు చేయడంతో కాలనీల వాసులు ఉదయం, సాయంత్రం వేళల్లో పార్కులకు క్యూ కడుతున్నారు.

వుడా లే అవుట్ ప్రత్యేకం

ఎన్ఏడీ సమీపంలోని 52వ వార్డు వుడా కాలనీ వాసుల సౌకర్యార్థం గత ప్రభుత్వం పలు చోట్ల పార్కులను అభివృద్ధి చేసింది. దీంతో కాలనీలోని చిల్డ్రన్స్ పార్కు చూడముచ్చటగా ఉంది. విశాలమైన పార్కులో గ్రీనరీ అభివృద్ధి చేయడంతో ఇక్కడ ఎక్కువ సేపు గడిపేందుకు కాలనీ వాసులు ఆసక్తి చూపుతున్నారు. పచ్చదనం పంచే చెట్లు, వాటి కింద కూర్చేనేందుకు వీలుగా బల్లలు ఏర్పాటు చేశారు. ఇక్కడ విశాలమైన షటిల్ కోర్టు కూడా అందుబాటులో ఉంది. చిల్డ్రన్స్ పార్కు అయినప్పటికీ వుడా కాలనీలో ఉండే పిల్లలు, వృద్ధులు, ప్రధానంగా మహిళలకు ఉపయోగకరంగా ఉండేలా ఇక్కడ తగిన సౌకర్యాలు కల్పించారు. కాలనీ వాసుల విన్నపాల మేరకు డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ ప్రత్యేక చొరవ తీసుకొని పార్కును ఆధునికీకరించేలా జీవీఎంసీ ద్వారా నిధులు కేటాయింపు చేశారు.

సీసీ కెమెరాలతో భద్రత

పార్కు నిర్వహణ తమ సామాజిక బాధ్యతగా వుడా కాలనీ వాసులు చిల్డ్రన్స్ పార్కు పరిరక్షణకు ముందుకొచ్చారు. కాలనీ అసోసియేషన్ ద్వారా ఇక్కడ సెక్యూరిటీ గార్డును ఏర్పాటు చేశారు. పార్కుకు వచ్చే వారికి ఎటువంటి అభద్రత లేకుండా సీసీ కెమెరాలు ఇక్కడ ఏర్పాటు చేయడం కాలనీ వాసుల సామాజిక బాధ్యతకు అద్దం పడుతోంది.



షటిల్ ఆడుతున్న చిన్నారులు



కూర్చొనేందుకు సౌకర్యంగా బల్లలు

కాలనీల్లో రహదారుల అభివృద్ధికి చర్యలు



రహదారిని పరిశీలిస్తున్న కార్పొరేటర్ రమణ

విశాఖ విద్య: కాలనీల్లో రహదారులు అభివృద్ధికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు 90వ వార్డు కార్పొరేటర్ బొమ్మిడి రమణ అన్నారు. బాజీ జంక్షన్ నుంచి ఆల్ఫా హోటల్ వరకు ఉన్న మట్టి రోడ్డును మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీఆర్టీఎస్ రోడ్డులో వాహనాల రద్దీ ఉండడంతో ప్రత్యామ్నాయ రహదారులను అభివృద్ధి చేసేలా దృష్టి సారించామన్నారు. రహదారి నిర్మాణానికి తగిన ప్రతిపాదనలు చేయాలని ఇంజినీరింగ్ అధికారులకు సూచించారు. అనంతరం పార్టీ నాయకులతో కలసి నూతన ఇసుక పాలసీపై హర్షం వ్యక్తం చేస్తూ, సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు.

19న కొబ్బరి చెక్కల వేలం

మహారాణిపేట: గాజువాక జింక్ ఏరియాలోని ఆంజయనేయ స్వామివారి దేవస్థానంలో భక్తులు అందించిన కొబ్బరి చెక్కలు పోగు చేసుకునే లైసెన్సు ఏడాది పాటు పొందేందుకు ఈనెల 19న టెండర్ కమ్ బహిరంగ వేలం నిర్వహించనున్నారు. రూ. వెయ్యి ధరావత్తు చెల్లించి 19న జరిగే వేలంలో పాల్గొనాలని దేవాలయ కార్యనిర్వహణాధికారి అల్లు జగన్నాథం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఏడాది ఆగస్టు ఒకటో తేదీ నుంచి వచ్చే ఏడాది జులై 31వ తేదీ వరకు కాల పరిమితితో వేలం వేస్తున్నామన్నారు.



నిరుపయోగంగా ఉన్న వాణిజ్య సముదాయం



బీఆర్‌టీఎస్ రహదారిలో వ్యాపారాలు

నిరుపయోగంగా హాకర్స్ జోన్

- 27 ఏళ్ల నుంచి మొక్కుబడిగానే షాపులు
- అసాంఘిక కార్యక్రమాలకు అడ్డాగా మారిన వైనం
- వినియోగంలోకి తేవాలని స్థానికుల వినతి



అసాంఘిక కార్యకలాపాలకు నిలయంగా మారిన దుకాణాలు

కంచరపాలెం: కంచరపాలెంలోని నేతాజీ వంతెన దిగువన నిర్మించిన వాణిజ్య సముదాయం (హాకర్స్ జోన్) నిరుపయోగంగా మారింది. 27 ఏళ్ల క్రితం నగర పాలక సంస్థ వాణిజ్య సముదాయం నిర్మించింది. అయితే నాటి నుంచి నేటి వరకు వాణిజ్య సముదాయంలో దుకాణాలు తెరుచుకోలేదు. మౌలిక వసతులు కల్పించక పోవడంతో వ్యాపారులు షాపులు తెరవడానికి ముందుకు రావడంలేదు. దీంతో బీఆర్‌టీఎస్ రోడ్డుపైనే చాలా మంది వ్యాపారాలు చేస్తున్నారు. ట్రాఫిక్‌కు అంతరాయం కలుగుతున్నా పట్టించుకునే పోలీసులే కరువయ్యారు. హాకర్స్ జోన్ వినియోగంలోకి తెస్తే ట్రాఫిక్ సమస్య తలెత్తదంటున్నారు. రహదారి పనులు పూర్తయితే హాకర్ల జోన్ వినియోగంలోకి తెస్తామని చెప్పిన అధికారులు జాడే కనపించడం లేదు. సంబంధిత అధికారులు హాకర్ల జోన్ వినియోగంలోకి తీసుకురావాలని పలువురు కోరుతున్నారు.

అసాంఘిక కార్యక్రమాలకు నిలయంగా..

ఇక్కడ నిర్మించిన దుకాణాలు ఖాళీగా ఉండడంతో రాత్రి సమయాల్లో అసాంఘిక కార్యక్రమాలకు నిలయంగా మారుతోందని స్థానికులు వాపోతున్నారు. ఖాళీగా ఉన్న దుకాణాల్లో గంజాయి, మందుబాబులు బెడద ఎక్కువైంది. స్థానికులు మందుబాబులను నిలదీస్తే కొట్లాటకు దిగుతున్నారు.

బీఆర్‌టీఎస్ రహదారులపై వ్యాపారాలు

నిత్యం రద్దీగా ఉండే ఈ ప్రాంతంలో రోడ్లపైనే వ్యాపారాలు చేస్తున్నారు. సమీపంలోని పాఠశాలలు ఉన్నాయి. రామ్మూర్తిపంతులుపేట, కా.కాలనీ, కంచరపాలెం ప్రాథమిక, ఉన్నత పాఠశాలలు విడిచిపెట్టినపుడు ట్రాఫిక్ సమస్య జఠిలమవుతోంది.

భయాందోళన మధ్య రాకపోకలు

వంతెన కింద ఖాళీ దుకాణాల్లో గంజాయి, మందుబాబులు, ఆకతాయిల బెడద ఎక్కువైంది. దీంతో గాంధీనగర్ ప్రజలు భయాందోళన మధ్య రాకపోకలు సాగిస్తున్నాం. విద్యార్థినులు ఇటుగా రాకపోకలు చేస్తుంటే ఆకతాయిలు ఇబ్బందులకు గురిచేస్తున్నారు. మా పిల్లలకు ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని ఆందోళనగా ఉంది. అధికారులు స్పందించాలి.

– పైడి అప్పారావు, గాంధీనగర్, కంచరపాలెం.

ట్రాఫిక్‌కు ఇబ్బందిగా ఉంది

హాకర్స్ జోన్ ఏర్పాటు చేయకపోవడంతో బీఆర్‌టీఎస్ రహదారిలో చిరు, చిల్లర వర్తక వ్యాపారులు రోడ్డును అక్రమించి వ్యాపారాలు చేస్తున్నారు. వాహనాలు, పాదచారుల రాకపోకలు ఇబ్బంది కరంగా ఉంది. వాణిజ్య సముదాయంలో దుకాణాలు ప్రారంభిస్తే ట్రాఫిక్‌కు అంతరాయం ఉండదు.

–బి. ఆనంద్‌కుమార్, గవర కంచరపాలెం.

చిన్నారులకు స్కూల్ బ్యాగుల వితరణ



చిన్నారులకు సామగ్రి అందజేస్తున్న జాన్‌వెస్లీ తదితరులు

కంచరపాలెం: స్థానిక కంచరపాలెం అంగన్‌వాడీ కేంద్రంలో పీఏబీ ఎల్ఈడీ వాల్స్ అధినేత అజేయ్ జాన్‌వెస్లీ మంగళవారం చిన్నారులకు స్కూల్ బ్యాగులు, చిత్రలేఖన సామగ్రి పంపిణీ చేశారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ విజయలక్ష్మి, పెంటకోట శ్రీనివాసరావు, మార్తామ్మ, వాసు, దివ్య, కుమార్, సంస్థ సభ్యులు పాల్గొన్నారు.

ఫుడ్ కోర్టులో సౌకర్యాలు కల్పిస్తాం

డిప్యూటీ మేయర్ శ్రీధర్



ఫుడ్ కోర్టును పరిశీలిస్తున్న డిప్యూటీ మేయర్ శ్రీధర్

విశాఖ విద్య: ఎన్ఏడీలో ఏర్పాటు చేసిన ఫుడ్ కోర్టులో మరినిన సౌకర్యాలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటామని నగర పాలక సంస్థ డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ అన్నారు. జీవీఎంసీ అధికారులతో కలసి మంగళవారం ఫుడ్ కోర్టును పరిశీలించారు. ఎన్ఏడీ సెంటర్ నుంచి మర్రిపాలెం వెళ్లే బీఆర్టీఎస్ దారిలో పెంతికోస్తు చర్చి వద్ద ఏర్పాటు చేసిన ఫుడ్ కోర్టుకు మంచి ఆదరణ లభిస్తున్నందన్నారు. దీన్ని దృష్టిలో పెట్టుకుని మరిన్ని సౌకర్యాలు కల్పించాలని జీవీఎంసీ అధికారులకు సూచించారు. దుకాణాల నిర్వహణకు తాగునీరు సరఫరా చేయాలని దుకాణ యజమానాలు కోరారు. దీనిపై సానుకూలంగా స్పందించిన డిప్యూటీ మేయర్ శ్రీధర్ తగిన చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. అనంతరం మర్రిపాలెం గ్రీన్ బెల్ట్ ఏరియాలో మహిళల కోసం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన పార్కును పరిశీలించారు. పార్కులో చేపడుతున్న పనులను త్వరతగతిన పూర్తి చేయాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. పర్యటనలో ఇంజినీరింగ్, వాటర్ వర్క్స్ విభాగం ఏఈలు ఉష, ఇమాన్యుయేల్, వర్క్ ఇన్‌స్పెక్టర్ బాలకృష్ణ, శానిటరీ ఇన్‌స్పెక్టర్ మూర్తి, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

ఫుట్‌పాత్‌పై మెటీరియల్ తొలగింపు

సాక్షి ఎఫెక్ట్..



తొలగించకు ముందు...



ఆ తరువాత

విశాఖ విద్య: బాజీ జంక్షన్‌లోని ఫుట్‌పాత్‌లపై నిల్వ చేసిన భవన నిర్మాణ మెటీరియల్‌ను జీవీఎంసీ అధికారులు తొలగించారు. 'ఫుట్‌పాత్‌లపై నిర్మాణ మెటీరియల్' అనే శీర్షికన మంగళవారం ప్రచురితమైన వార్తకు జీవీఎంసీ అధికారులు స్పందించారు. టౌన్ ప్లానింగ్ విభాగం సిబ్బంది ఆధ్వర్యంలో ప్రత్యేక స్క్వాడ్ బృందం హుటా హుటిన పనులు చేపట్టారు. జీవీఎంసీ 90వ వార్డు విజేత సూపర్ మార్కెట్ సమీపంలో నిర్మిస్తున్న బహుళ అంతస్తుల భవనానికి సంబంధించిన మెటీరియల్‌ను రోజుల తరబడి ఫుట్‌పాత్‌పై నిల్వ చేస్తున్నారు. దీని వల్ల అటుగా వెళ్లే పాదచారులకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. సాక్షి కథనంతో ఎట్టకేలకు అధికారులు స్పందించి,నిర్మాణ మెటీరియల్‌ను అక్కడ నుంచి తొలగించారు. దీనిపై పరిసర దుకాణదారులు, పాదచారులు హర్షం వ్యక్తం చేశారు.

61వ వార్డులో ఏడీసీ పర్యటన



వార్డులో పర్యటిస్తున్న ఏడీసీ విశ్వనాథన్, జెడ్సీ కృష్ణ

మల్కాపురం: జీవీఎంసీ 61వ వార్డు పరిధిలోని పలు ప్రాంతాల్లో ఏడీసీ విశ్వనాథన్ మంగళవారం ఆకస్మికంగా పర్యటించారు. ప్రజా సమస్యలు తెలుసుకునే కార్యక్రమంలో భాగంగా జీవీఎంసీలోని పలు విభాగాల ఉన్నతాధికారులతో కలిసి మల్కాపురం, పల్లి వీధి, గొల్లవీధి ప్రాంతాల్లో పర్యటించారు. వీధుల్లో కాల్వలు పూర్తిగా శిథిలావస్థకు చేరుకోవడంతో మురుగు బయటికి వస్తోందని ఆయా ప్రాంతాల మహిళలు ఏడీసీ దృష్టికి తీసుకువెళ్లారు. దీనిపై స్పందించిన ఆయన అక్కడ జీవీఎంసీ ఇంజినీరింగ్ వర్క్స్ అధికారులతో మాట్లాడారు. ఈ ప్రాంతంలో ఇలాంటి సమస్యలు ఎక్కడెక్కడ ఉన్నాయో గుర్తించి, దానిపై అంచనా రూపొందించాలన్నారు. అలాగే వార్డు పరిధిలో పారిశుధ్య సమస్య, మంచినీటి సరఫరా తదితర సమస్యలు ఏమైనా ఉన్నాయా అని ఆయా ప్రాంతవాసులను అడిగి తెలుసుకున్నారు. ఈ పర్యటనలో జోన్-5 జెడ్సీ కృష్ణ, జీవీఎంసీ ఉన్నతాధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

వేడుకగా జువ్వాలమ్మ పండగ



జువ్వాలమ్మ అమ్మవారికి పూజలు చేస్తున్న బెహరా భాస్కరరావు

గోపాలపట్నం: జీవీఎంసీ 92వ వార్డు వెంకటాపురంలో జువ్వాలమ్మ పండగను మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు బెహరా భాస్కరరావు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.ఆలయ అర్చకులు అమ్మవారి శేష వస్త్రాలు, తీర్థ ప్రసాదాలు అందించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు ఇల్లపు మహాలక్ష్మినాయుడు, వరహాలు, సురేష్, జగదీష్ పాల్గొన్నారు.

'స్టాప్ డయేరియా'పై అవగాహన కల్పించాలి



భీమ్‌నగర్ యూపీహెచ్‌సీ సిబ్బందితో మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో డాక్టర్ జగదీశ్వరరావు

మహారాణిపేట: స్టాప్ డయేరియా కార్యక్రమంపై ప్రజలకు అవగాహన కల్పించాలని డీఎంహెచ్‌వో డాక్టర్ పి.జగదీశ్వరరావు అన్నారు. మంగళవారం భీమ్‌నగర్ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా మాతా శిశు ఆరోగ్య సేవల గురించి ఆరోగ్య సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. అడల్ట్ బీసీజీ వ్యాక్సిన్, గర్భిణులకు అందుతున్న సేవలను తనిఖీ చేసి, గర్భిణులకు ఐరన్ మాత్రలు ఇవ్వాలని తెలిపారు. ఎనీమియాపై ఏఎన్ఎం, ఆశ కార్యకర్తలు, సూపర్‌వైజర్లతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. యూపీహెచ్‌సీల్లో సాధారణ ప్రసవాలు జరిగేలా చూడాలని ఏఎన్ఎం, ఆశ కార్యకర్తలు, వైద్యాధికారులకు తెలిపారు. సిబ్బంది సమయపాలన పాటించాలన్నారు. ప్రతీ శుక్రవారం ఫ్రైడే-డ్రైడే పాటించాలని తెలిపారు. పట్టణ ఆరోగ్య కేంద్రం వైద్యులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి



మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి శేషమ్మ



పాల్గొన్న ఆర్‌టీఏ సిబ్బంది, ప్రజలు

మహారాణిపేట: ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలను పాటిస్తే చాలా వరకు రోడ్డు ప్రమాదాలను నివారించవచ్చునని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి ఎం.వెంకట శేషమ్మ తెలిపారు. మంగళవారం మాధవధారలో ఆర్‌టీఏ కార్యాలయంలో సిబ్బంది, ప్రజలకు మోటారు వాహన చట్టాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ద్విచక్ర వాహన చోదకులు తప్పని సరిగా హెల్మెట్ ధరించాలని, కారులో ప్రయాణించిన వారు సీటు బెల్టు పెట్టుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆర్‌టీవో జె.రామ్ కుమార్‌పాల్గొన్నారు. అనంతరం ట్రాఫిక్ చట్టాలపై విద్యార్థులకు విశాఖ జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో గొల్లలపాలెంలోని శ్రీ చైతన్య విద్యా సంస్థల్లో అవగాహన కల్పించారు.